క్లుప్తంగా

నేడు వేదారణ్యానికి దేశపతి శ్రీనివాస్

కందుకూరు: మండలంలోని చిప్పలపల్లి పరిధిలోని వేదారణ్యం వేద పాఠశాలలో గురువారం నాట్య గురువులు డాక్టర్ నటరాజ్ రామకృష్ణ, డాక్టర్ పేరిణికుమార్ ఆధ్వర్యంలో పేరిణి పంచాంగములు పరిణామక్రమం పుస్తక ఆవిష్కరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ప్రకటించారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించుకుంటాం



ఎంపీ రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని బుధవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేటర్లు మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డికి పూల బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున చేవెళ్ల బరిలో ఉన్న రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు జైహింద్, మనోహర్, బాలునాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

చల్లాకు నేతల సన్మానం



చల్లా నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న శ్రీనివాస్‌రావు

హుడాకాంప్లెక్స్: పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక శాఖ సంస్థ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని బుధవారం కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్యకర్తల కష్టంతో సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రానున్న పార్లమెంటు ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పులి నవీన్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట పాస్టర్స్ అసోసియేషన్‌కు ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ అసోసియేషన్

మీర్‌పేట: మీర్‌పేట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం మిథులానగర్‌లోని హోలీకింగ్స్ చర్చిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దానిబాబు, ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్, ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా ఐజక్, కార్యదర్శిగా జయపాల్, కోశాధికారిగా జాన్, హరిబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ప్రమోద్, జయపాల్, న్యాయ సలహాదారులుగా యాదల కిషోర్‌బాబు, వై.గురవయ్య, సలహాదారులుగా డా.ఎడ్గర్ సాతులూరి, జోసెఫ్ ఇమ్మానుయేల్ ఎన్నికయ్యారు.

స్పెల్‌బీలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని లార్డ్స్ ఒలంపియాడ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో స్పెల్‌బీ పోటీల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ మేరకు మైండ్ వార్స్ సంస్థ నిర్వహించిన ఆంగ్ల పద కోశ ప్రావీణ్య పరీక్షల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు గ్లోబల్ భాషలో పట్టు సాధించేలా శిక్షణ పొంది ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బానూరి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సిలిండర్ పేలి షాపు దగ్ధం

హస్తినాపురం: గ్యాస్ సిలిండర్ పేలి షాపు కాలి బూడిదైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. స్థానిక రైతుబజార్ దగ్గర ఉన్న మిర్చి డబ్బాలో బుధవారం సిలిండర్ పేలి శబ్దం వచ్చింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లాభాల్లో సహకార సంఘం

అప్పుల ఊబి నుంచి ఆర్థిక బలోపేతం దిశగా బండ్లగూడ ఖల్సా సొసైటీ

బడంగ్‌పేట్: రైతులను ప్రోత్సహించేందుకు దేశ వ్యాప్తంగా ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేసింది. కానీ కొన్ని చోట్ల సర్కారు నుంచి సరైన ప్రోత్సాహం లభించక సంఘాలు నిర్వీర్యమవుతున్నాయి. నష్టాల్లో కూరుకుపోయిన సహకార సంఘాన్ని పటిష్టమైన ప్రణాళికతో లాభాల బాట పట్టించారు. ప్రైవేట్ బ్యాంకులకు దీటుగా బండ్లగూడ ఖల్సా సొసైటీ బాలాపూర్ దూసుకుపోతోంది. 1945లో బండ్లగూడ ఖాల్సా పేరుతో బాలాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఏర్పాటు చేశారు. బాలాపూర్, బండ్లగూడ, మైలర్‌దేవర్‌పల్లి, మల్లాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాలకు చెందిన రైతులు ఇందులో సభ్యులుగా ఉంటారు.

సకాలంలో వసూళ్లు

బండ్లగూడ ఖాల్సా కొన్నేళ్లుగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 17 ఏళ్ల నుంచి పాలకవర్గం కొత్త నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగడంతో లాభాలు ఆర్జిస్తున్నారు. సంఘంలో 2,800 మంది సభ్యులకు మొత్తం రూ.5.98 కోట్ల రుణాలు ఇచ్చారు. పొదుపు ఖాతా కింద నగదు జమ చేసుకుంటే అందుకు మూడింతలు కలిపి రుణాలు ఇస్తున్నారు. తక్కువ వడ్డీకే రూ.11 కోట్ల గోల్డ్ లోన్లు ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.9 కోట్ల మేర డిపాజిట్లను సేకరించారు. క్రాప్, స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలకు అందిస్తున్నారు. సంఘం లాభాల నుంచి షేర్ కలిగిన రైతులకు 10 శాతం డివిడెంట్ ఇస్తున్న ఏకైక సొసైటీ ఇదే కావడం గమనార్హం. సకాలంలో బకాయిలను వసూలు చేసి లాభాల బాటలో సంఘం సాగుతోంది.



బాలాపూర్‌లో ఉన్న బండ్లగూడ ఖల్సా సొసైటీ భవనం

17 ఏళ్ల కృషి



జిల్లాలోని అన్ని సొసైటీలను పరిశీలించాను. ఈ సంఘం నగరానికి చేరువలో ఉన్నది కాబట్టి వ్యవసాయంతో పాటు కమర్షియల్ ఆలోచనలు చేసి బహుళ నిర్ణయాలు తీసుకున్నాం. ఒక్కొక్కటిగా ఫలితాలు వస్తుండటంతో ఇప్పుడు కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నాం. దీని వెనక 17 ఏళ్ల శ్రమ ఉంది.

– సింగిరెడ్డి పెంటారెడ్డి, చైర్మన్

ప్రజల సహకారం భేష్



ప్రజలు, ఖాతాదారులు, స్థానికులు సహకారం అందిస్తున్నారు. సంఘం కార్యవర్గం తీసుకున్న నిర్ణయాలే బ్యాంకును మెరుగైన స్థానంలో నిలిచేలా ఉంచింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు కూడా పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. కార్యవర్గం సభ్యుల చొరవ సైతం అమోఘం.

– కొలన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఘనంగా గరుడ వాహన సేవ

తలకొండపల్లి: చుక్కాపూర్ కల్కిదొనగుట్ట గోపాల స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి గరుడ వాహన సేవా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కృష్ణమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి గాలి గోపురం వరకు అత్యంత శోభాయమానంగా గరుడ వాహన సేవా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ ముఖ్య కార్యనిర్వాహక సభ్యులు సిద్ధాంతి కృష్ణమూర్తిశర్మ, నితిన్‌శర్మ, కృష్ణయ్య, నారాయణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు..

ఆమనగల్లు: పట్టణంలోని వెంకటగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, సుదర్శన హవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను ఆలయ అర్చక బృందం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాపిశెట్టి రాము, అర్చకులు కృష్ణమాచార్యులు, నిహాల్ అనిల్‌కుమార్, వెంకటరమణచారి, కృష్ణ, చైతన్య చారి, సంజీత్‌పాండే, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: కల్కిదొనగుట్ట ఆలయంలో గరుడ వాహనసేవ



ఆమనగల్లులో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాలయాపనకే ధరణి స్పెషల్‌డ్రైవ్

యాచారం: ధరణి స్పెషల్‌డ్రైవ్‌తో కాలయాన తప్పా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 1 నుంచి ధరణి స్పెషల్‌డ్రైవ్ పెట్టిన సర్కార్ రెవెన్యూ అధికారులకు భూ సమస్యలు పరిష్కరించే లాగిన్లు ఇవ్వకుండా జాప్యం చేయడంలో అర్థం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. స్పెషల్‌డ్రైవ్‌తో భూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే తహసీల్దార్లకే లాగిన్లు ఇచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలి



కల్యాణ పత్రికను ఆవిష్కరిస్తున్న వీరేందర్‌గౌడ్

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ ఆది లక్ష్మి అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే తిరు కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ కోరారు. బుధవారం ఆలయ ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, సింహాచార్యులు కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాల నుంచి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం నుంచి ప్రారంభమై 24 వరకు కొనసాగే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు విలాస్, యాదగిరిరెడ్డి, నాయకులు సుధాకర్, శివయ్య, మదన్‌మోహన్, శ్రీనివాస్ యాదవ్, నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



గణపతి పూజలో పాల్గొన్న వంగ మధుసూదన్‌రెడ్డి తదితరులు

హస్తినాపురం: కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగ మధుసూదన్‌రెడ్డి దంపతులు గణపతి పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం పుణ్యాహవచనం, అఖండదీప స్థాపన, దీక్షాధారణ, అంకురార్పణ, గోపూజ, చండీమండపం, యాగశాల ప్రవేశం, శ్వేతార్కమూలగణపతి, హోమం, హారతితో మొదటిరోజు పూజలు ముగిశాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సద్ది సందీప్‌రెడ్డి, ఎల్.రమేశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లికార్జున్ , మిర్యాల అంజయ్యగుప్తా, సూర్య ప్రకాశ్‌గుప్తా, వంగ ప్రవీన్‌రెడ్డి, జి.నరేందర్ రెడ్డి, ఎం.కేశవరెడ్డి, నిర్మలేశ్ గుప్తా పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ సమస్యలు పరిష్కరిస్తా

ఎల్‌బీనగర్: శ్రీరాంనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు త్వరలో పరిష్కారమయ్యేలా చూస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, కోశాధికారి రవీందర్‌రెడ్డి సంయుక్త కార్యదర్శి ప్రసాద్, నగమణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, అడ్వైజర్లు రంగారెడ్డి, రాధాకృష్ణ, కృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

యోగాతో మానసిక వికాసం, ఆరోగ్యం

చైతన్యపురి: సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతుల్లో బుధవారం గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వాకర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యోగాసనాల ద్వారా మానసిక వికాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. వాకర్స్ కోసం యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రియదర్శిని పార్కు సంరక్షణ, అభివృద్ధికి పర్యాటక శాఖ చర్యలు తీసుకునేలా చూడాలని కార్పొరేటర్‌ను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, యోగా సాధకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



వాకర్స్ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

నిఘా లేక రెచ్చిపోతున్నారు!



ఎన్టీఆర్‌నగర్ సమీపంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వీఎంహోమ్ స్థలం

- తాగిన మైకంలో ఘర్షణలు
- భయాందోళనకు గురవుతున్న ఎన్టీఆర్ నగర్, చిత్రాలేఅవుట్ కాలనీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని లేఅవుట్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలాలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. మందు బాబులు, గంజాయి సేవించే వారు రాత్రి పూట ఇక్కడ తిష్ట వేస్తున్నారు. మత్తులో లొల్లి చేస్తూ రెచ్చిపోతూ స్థానికులకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారు. ఎన్టీఆర్‌నగర్ సమీపంలో విక్టోరియా మెమోరియల్(వీఎం హోమ్) పాఠశాలకు చెందిన స్థలం ఉంది. గతంలోఇక్కడ కూరగాయలు, పండ్లు పండించి విద్యార్థుల కోసం తరలించే వారు. అయితే, కొన్నేళ్లుగా ఈ స్థలాన్ని వీఎం హోమ్ వారు పట్టించుకోవడం మానేయడంతో అక్కడ పెద్ద ఎత్తున చెత్తా చెదారం చేరింది.

- గతంలో కురిసిన భారీ వర్షాలకు విక్టోరియా మెమోరియల్ స్థలం ప్రహరీ కూలిపోయింది. దీంతో ఎన్టీఆర్‌నగర్, భరత్ నగర్, శివమ్మ నగర్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి యువకులు ఈ ఖాళీ స్థలంలోకి వచ్చి గంజాయి, మద్యం సేవిస్తూ లొల్లి చేస్తున్నారు. దీనికి తోడు అక్కడ పెద్ద ఎత్తున చెట్లు ఉండటంతో అటుగా వెళ్లేందుకు స్థానికులు జంకుతున్నారు.
- ఇక్కడ కొందరు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో జోరుగా పేకాట ఆడుతున్నట్లున్నారు.
- అక్కడకు వాహనాలు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో పోలీసు పెట్రోలింగ్ పోలీసులు సైతం ఆ ప్రాంతంలోకి వెళ్లడం లేదు.
- చిత్రా లేఅవుట్ కాలనీ పక్కనే ఉన్న స్థలంలో గతంలో హెచ్ఎండీఏ అధికారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం స్థలం వదిలేశారు. పక్కనే వీఎంహోం స్థలం ఖాళీగా ఉండటంతో పాటు, హెచ్ఎండీఏ స్థలం కూడా ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది.
- గతంలో ఈ స్థలాలకు చుట్టూ పెన్సింగ్, ప్రహరీ ఉండేది. ఇప్పుడు లేక పోవడం, అక్కడ నిఘా లేక పోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డంగా మారింది.
- ఇప్పటికైనా విక్టోరియా మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు, హెచ్ఎండీఏ అధికారులు స్పందించి వర్షాలకు కూలిపోయిన ప్రహరీలను తిరిగి నిర్మించి అక్కడ ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు కూడా ఖాళీ స్థలాలపై రాత్రి పూట నిఘా ఉంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేకాట ఆడుతూ, గంజాయి తాగుతూ...



ఎన్టీఆర్‌నగర్ సమీపంలో ఉన్న వీఎం హోం తోటలో గతంలో కూరగాయాలు పండించే వారు. కొంత కాలంగా స్థలం ఖాళీగా ఉండటంతో స్థానిక యువకులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మార్చుకున్నారు. ఉదయం, రాత్రి సమయాలలో పేకాట ఆడుతూ , గంజాయి, మద్యం తాగుతున్నారు. అక్కడికి ఎవరినీ రానీయకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలి.

– బాతరాజు నర్సింహ, ఎన్టీఆర్‌నగర్

పోలీసు నిఘా పెట్టాలి



ఎన్టీఆర్ నగర్‌లోని వీఎం హోం స్థలానికి చుట్టూ పహరీ నిర్మించాలి. ఖాళీగా ఉన్న స్థలాల్లోకి యువకులు రాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి. బస్తీలో గంజాయి తాగేవారు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. గంజాయిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

– ఇస్మాయిల్, ఎన్టీఆర్ నగర్



గత వర్షాలకు కూలిపోయిన వీఎం హోమ్ తోట ప్రహరీ



మందుబాబులకు అడ్డగా మారిన చిత్రలేఔట్ కాలనీలో హెచ్ఎండీఏ స్థలం

14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

చైతన్యపురి: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 14 ఎంపీ స్థానాలు గెలుపొందటం ఖాయం అని రాష్ట్ర రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం చైతన్యపురిలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మల్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు అనుకూలమైన ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాంది పలికారన్నారు. 100 రోజులు పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు, హామీలను నేరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. దేశంలో సైతం కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. పార్టీ నాయకులు మల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. పలువురు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'మల్లు రవి' ప్రకటనపై హర్షం

ఆమనగల్లు: నాగర్ కర్నూల్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవిని పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో జిల్లా కాంగ్రెస్ నాయకుడు రవీందర్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆమనగల్లు పట్టణంతో పాటు, మేడిగడ్డ తండాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సురేశ్‌నాయక్, పాండునాయక్, రాజ్‌కుమార్, వసంత్, లోక్యా, నీలా, మల్యా, దస్రు తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి ఘన స్వాగతం

తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని మల్లు రవికి కెటాయించినందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, యువనాయకుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గెలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంబురాలు

తలకొండపల్లి: నాగర్‌కర్నూల్ టికెట్ మల్లు రవికి కాంగ్రెస్ కేటాయించినందుకు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, రాష్ట్ర నాయకుడు కాసు శ్రీనివాసురెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



తలకొండపల్లి: మల్లురవికి ఎంపీ టికెట్ ఇవ్వడంపై సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్‌శ్రేణులు